సాక్షి మహబూబ్‌నగర్

గురువారం, 15, జూన్, 2023



వైద్యసేవల్లో మరో అడుగు

జడ్చర్లకు క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరుతో వైద్య సేవలు మెరుగుపడనున్నాయి.

వివరాలు 4లో ▸



ముగిసిన షాఅలీ ఉర్సు

అలంపూర్‌లో షా–అలీ పహిల్వాన్ ఉర్సు బుధవారం అట్టహాసంగా ముగిసింది.

వివరాలు 4లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.1 /24.9

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా నుంచి ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగం కోసం రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన ప్రక్రియ ప్రారంభమైందని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం మొదటి రోజు అభ్యర్థులకు సర్టిఫికెట్స్ పరిశీలన నిర్వహించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యానికి గురికాకుండా, సర్టిఫికెట్స్ పరిశీలన ప్రక్రియ వేగంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ నియమ నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. మొదటి రోజు 500 మంది అభ్యర్థులకు గాను 420 మంది హాజరు కాగా వారి సర్టిఫికెట్స్ పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఏఓ రుక్మిణిబాయి, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు ఎస్‌ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు లేదా మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో భారీగా సీఐల బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు పోలీస్ శాఖలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. చాలాకాలంగా ఒకే దగ్గర పనిచేస్తున్న వారితోపాటు రెండేళ్లుగా పనిచేస్తున్న వారికి సైతం స్థానచలనం కలగనుంది.

ఎవరెవరు ఎక్కడికి..

మహబూబ్‌నగర్ సీసీఎస్ నుంచి ఎస్‌ఐ కె.శ్రీనివాస్‌ను బాలానగర్‌కు బదిలీ చేశారు. అలాగే కోయిలకొండ ఎస్‌ఐ వి.సతీష్‌ను డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు, బాలానగర్ ఎస్‌ఐ జయప్రసాద్‌ను డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు, చారకొండ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్‌ను వీఆర్ నాగర్‌కర్నూల్‌కు, అచ్చంపేట రెండో ఎస్‌ఐ ఎం.రవిని చారకొండకు, సిద్దాపూర్ ఎస్‌ఐ గురుస్వామిని ఉప్పునుంతలకు బదిలీ చేశారు.

వేరుశనగ @ రూ.6,420

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగ క్వింటాల్‌కు రూ.6,770, కనిష్టంగా రూ.6,420 ధర లభించింది. అదే విధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,867, కనిష్టంగా రూ.1,730, ఆముదాలు గరిష్టంగా రూ.5,711, కనిష్టంగా రూ.5,584 పలికింది.

రెండ్రోజుల్లో చెల్లింపులు

ఉత్తిమాటే..



ముకర్లాబాద్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది (ఫైల్)

48 గంటల్లో రైతుల ఖాతాల్లో చేరని ధాన్యం డబ్బులు

- విక్రయించి నెలరోజులైనా తప్పని ఎదురుచూపులు
- మరోదిక్కు వానాకాలం సాగుకు రైతుల సమాయత్తం
- పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో జాప్యమే కారణం

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో పలు మార్లు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో నష్టపోక తప్పలేదు. మిగిలిన ధాన్యాన్ని విక్రయించగా అందుకు సంబంధించిన డబ్బు ఖాతాల్లో జమ కాక ఆందోళనకు గురవుతున్నారు. పంట విక్రయించిన 48 గంటల్లో (రెండురోజులు) ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉండగా.. రోజులు గడుస్తున్నా ఎదురుచూపులే మిగులుతున్నాయి. ఇప్పటికే వానాకాలం సీజన్ ముంచుకు రావడంతో పెట్టుబడికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. యాసంగిలో పండించిన ధాన్యంలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జిల్లాలో 196 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇప్పటి వరకు 1,01,259 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 1,00,238 మె.ట., మేర మిల్లులకు పంపించారు. మొత్తంగా కొనుగోళ్లు పూర్తవడంతో ఇప్పటి వరకు 138 కేంద్రాలను మూసివేశారు.

రైతుల ఆందోళన

జిల్లాలో ఇప్పటి వరకు 19,414 మంది రైతుల నుంచి రూ.208.53 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు చేరాక, అక్కడ ట్రక్‌షీట్ ప్రకారం ధాన్యం వచ్చింది.. లేనిది పరిశీలిస్తారు. ఆ తర్వాత కేంద్రం నిర్వాహకుల ట్యాబ్‌లో వివరాలు నమోదు చేస్తారు. మిల్లర్లు పరిశీలించి ఆమోదం తెలపగానే పౌరసరఫరాల సంస్థకు సమాచారం చేరుతుంది. అనంతరం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. 15,606 మంది రైతులకు సంబంధించి రూ.170 కోట్ల విలువ చేసే ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేశారు. అయితే ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతు ఖాతాలో డబ్బు జమ చేయాల్సి ఉన్నా వారాల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరు రైతులైతే నెలరోజులైనా డబ్బులు జమ కాక ఆందోళన చెందుతున్నారు. అయితే ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది.

వానాకాలం సీజన్ రాకతో..

ధాన్యం విక్రయించాక 48 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమవుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నా అది అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికే వానాకాలం సీజన్ సమీపించగా.. కొందరు రైతులు ఆరుతడి పంటల సాగు చేపట్టారు. మరికొద్ది రోజుల్లో దుక్కులు దున్ని, నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతారు. ప్రధానంగా ఎరువులు, విత్తనాలు కొనే సమయం ఇది. నగదు చేతిలో లేక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి త్వరగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడికి డబ్బుల్లేవ్



నాకున్న పొలంలో వరి పంట సాగు చేశాను. అకాల వర్షాల కారణంగా పంట దిగుబడి కూడా ఈసారి అంతంత మాత్రంగానే వచ్చింది. చేతికొచ్చిన ధాన్యంలో కొంత ఇంటి అవసరాలకు ఉంచుకుని మిగతాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మాను. వేసవి దుక్కులు దున్ని వానాకాలం పంట వేసేందుకు డబ్బులు లేవు. ధాన్యం అమ్మి 20 రోజులు దాటినా నేటికీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు.

– గోపాల్, రైతు, వెన్నవేడ్, గండేడ్ మండలం

25 రోజులైంది..



యాసంగిలో వరి సాగు చేయగా.. 65 బస్తాల దిగుబడి వచ్చింది. వాటిని తూకం వేయగా, గత నెలలోనే మిల్లుకు తరలించారు. 25 రోజులు గడిచినా బ్యాంకు ఖాతాలో ఇంకా డబ్బు జమ కాలేదు. రెండ్రోజుల్లో జమ చేస్తామని చెప్పినా అమలుకు నోచుకోవడం లేదు. చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు త్వరగా స్పందించాలి.

– అంజిలయ్య, మహమ్మదాబాద్

నమోదు ప్రకారమే..



ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. వడ్లను మిల్లులకు తరలించి ట్రక్ షీట్ జనరేటైన ప్రకారం రైతులకు చెల్లింపులు చేస్తున్నాం. కేంద్రానికి ధాన్యం తెచ్చినప్పటి నుంచి మిల్లులకు తరలింపు, బిల్లులు చెల్లించే వరకు జాప్యం లేకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రతీ గింజను కొని చెల్లింపులు చేస్తున్నాం.

– ప్రవీణ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

ధాన్యం దిగుబడి అంచనా 2.50 లక్షల మె.ట.,	సేకరణ లక్ష్యం 1.50 లక్షల మె.ట.,	ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు 196	కొనుగోలు చేసిన ధాన్యం 1,01,259 మె.ట.,	విక్రయించిన రైతులు 19,469
మొత్తం చెల్లించాల్సిన డబ్బులు రూ.208.53 కోట్లు	6,423 మందికి చెల్లించిన సొమ్ము రూ.73.66 కోట్లు	13,046 మందికి అందాల్సిన నగదు రూ.135.13 కోట్లు	మూసివేసిన కొనుగోలు కేంద్రాలు 138	

స్వరాష్ట్రంలో వైద్యరంగం ముందంజ



గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, డీఎంహెచ్‌ఓ తదితరులు

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: తెలంగాణ రాష్ట్రం దేశానికి సరిపోయే పీజీ వైద్య విద్యార్థులు, సూపర్‌స్పెషాలిటీ వైద్యులను అందజేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 70 ఏళ్లలో తెలంగాణ ప్రాంతానికి మూడు వైద్య కళాశాలలు వస్తే.. రాష్ట్రం వచ్చిన తొమ్మిదేళ్లలోనే ఉమ్మడి జిల్లాకు ఐదు మెడికల్ కళాశాలలు వచ్చాయన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్య దినోత్సవంలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల తర్వాత స్థానంలో పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఉందన్నారు. ఆస్పత్రుల స్థాయి పెంచడం, పోస్టులు భర్తీతోపాటు టీ–హబ్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మహబూబ్‌నగర్ నుంచి ఒక్క అంబులెన్స్ కూడా వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చేయడమే తమ లక్ష్యం అన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రి రంగంలో అనేక మార్పులు వచ్చాయని, పల్లె, బస్తీ దవాఖానాల ఏర్పాటుతోపాటు ఆస్పత్రుల్లో అధునాతన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం 15 మందికి న్యూట్రిషన్ కిట్లతోపాటు ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, డీఎంహెచ్‌ఓ కృష్ణ, వైద్య కళాశాల డైరెక్టర్ రమేష్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డాక్టర్ జీవన్ పాల్గొన్నారు.

■ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేయడంతోపాటు ఆస్పత్రిలోని ఆర్థో వార్డులో రోగులకు పండ్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశారు.

పండుగలా పల్లె ప్రగతి దినోత్సవం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించాలి
- కలెక్టర్ రవినాయక్ ఆదేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పల్లె ప్రగతిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మౌళిక వసతులు అన్నింటిపై ప్రజలకు వివరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం పల్లె ప్రగతి దినోత్సవంపై బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని పండుగలా జరపాలని, ఇందులో ప్రజాప్రతినిధులు, ప్రజలు, గ్రామస్థాయి సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసుకోవాలని కోరారు. గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి.. ప్రస్తుతం సమకూరినవి ప్రజలకు చూపించాలని చెప్పారు. సర్పంచ్ ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగరవేస్తారని, కార్యక్రమానికి అందరూ హాజరై జాతీయ గీతం ఆలపించాలన్నారు. అలాగే పరిశుభ్రత మెరుగు, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుదలకు సంబంధించి నాడు.. నేడు చిత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించి.. మన ఊరు– మన బడి పనులు, సబ్ సెంటర్ల ఏర్పాటు గురించి తెలియాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ సీతారామారావు, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ యాదయ్య, జెడ్పీసీఈఓ జ్యోతి పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహణపై సూచనలు చేశారు.

గుడ్లపై ‘తెలంగాణ ముద్ర’



అంగన్‌వాడీ కోడిగుడ్లపై తెలంగాణ ముద్ర

- ప్రతినెలా ఒక రంగుతో సరఫరాకు చర్యలు
- ఇకపై మోసాలకు పాల్పడితే సులభంగా గుర్తింపు
- అంగన్‌వాడీల్లో ఇచ్చే కోడిగుడ్లు పక్కదారికి అడ్డుకట్ట

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్న కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుత జూన్ నెల నుంచి కేంద్రాలకు ఇచ్చే గుడ్లపై అంగన్‌వాడీ ముద్ర వేశారు. ప్రస్తుతం ప్రతినెలా మూడుసార్లు కాంట్రాక్టర్లు గుడ్లు సరఫరా చేస్తారు. మొదటి విడతలో వచ్చిన గుడ్లపై నీలి రంగు ముద్రతో సరఫరా కాగా.. ఇక రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగు ముద్ర వేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు నెలకు 16 చొప్పున, గర్భిణులు, బాలింతలకు రోజుకు ఒకటి చొప్పున, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రోజుకు ఒకటి చొప్పున గుడ్లు ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు నాసిరకంగా ఉంటున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుళ్లిపోయిన గుడ్లను లబ్ధిదారులకు సరఫరా చేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే ప్రతి కోడిగుడ్డుపై అంగన్‌వాడీ గుడ్డు అని ముద్ర వేసి సరఫరా చేయనున్నారు.

నిత్యం 37,145 పంపిణీ..

జిల్లావ్యాప్తంగా 1,185 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6,741 మంది గర్భిణులు, 7,792 మంది బాలింతలు, 7 నెలల నుంచి సంవత్సరంలోపు చిన్నారులు 7,306 మంది, ఏడాది నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 25,131 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 22,612 మంది ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకం కింద కేంద్రాలు పనిచేసే దినాలను బట్టి నెలకు 26 గుడ్లు, 200 మిల్లీ లీటర్ల పాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న లబ్ధిదారులకు రోజుకు 2 గుడ్లు ఇస్తున్నారు. ఇలా నిత్యం 37,145 మంది లబ్ధిదారులకు కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారు. ఇకపై కాంట్రాక్టర్ సరఫరా చేసే గుడ్లను అంగన్‌వాడీ టీచర్లు క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలి. గుడ్లపై తెలంగాణ ముద్ర లేకపోతే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. గుడ్లు కుళ్లిపోతే సంబంధిత కాంట్రాక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనికి తోడు ముద్ర వేసిన గుడ్లు మార్కెట్‌లో విక్రయిస్తే వెంటనే గుర్తించే అవకాశం ఉంది.



మహబూబ్‌నగర్‌లోని రవీంద్రనగర్‌లో లబ్ధిదారులకు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ (ఫైల్)

అవకతవకలకు తావులేకుండా



అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు పక్కదారి పడకుండా ఉండేందుకు ప్రత్యేక ముద్ర వేసి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ప్రస్తుత జూన్ నెల నుంచి ఇది అమలులోకి వచ్చింది. నెలలో మూడు దఫాలుగా పంపిణీ చేసే గుడ్లకు నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగుల ముద్రలు వేసేలా చర్యలు చేపడుతున్నాం. విడతల వారీగా గుడ్లపై ఒక్కో రంగు ముద్ర వేయడంతో ఏ విడతలోని గుడ్లు పక్కదారి పట్టాయో పక్కాగా గుర్తించేందుకు వీలుంటుంది.

– జరీనాబేగం, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

పీయూలో కొనసాగుతున్న నిరసన దీక్షలు



పీజీ కళాశాల ఎదుట నినాదాలు చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పుటా ఆధ్వర్యంలో పీయూలో చేపట్టిన ఒప్పంద అధ్యాపకుల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. వీరు నెల రోజులుగా ఈ నిరసనను వివిధ రూపాల్లో ప్రదర్శిస్తున్నారు. బుధవారం భోజన విరామ సమయంలో పీజీ కళాశాల ఎదుట తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పుటా అధ్యక్షుడు డా.వంగరి భూమయ్య మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాలమూరు విద్యార్థి యువతకు దిశానిర్దేశం చేసిన 'తెలంగాణ ఉద్యమమే' తమకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పుటా రాష్ట్ర నాయకులు శేకుంతి రవికుమార్, విజయభాస్కర్, సుజాత, స్వాతి, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి డీజీపీ అంజనికుమార్‌తో కలిసి కలెక్టర్లు, ఎస్పీలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సన్నద్ధ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనుందని, ఇందుకుగాను పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించేలా, రెండో విడత ఓటరు జాబితా రూపకల్పన కార్యక్రమం నిర్వహించాలని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను ప్రస్తుత స్థితిగతులపై నివేదిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన, గత సాధారణ ఎన్నికల సమయంలో శాంతిభద్రత సమస్య వచ్చిన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, బూత్ స్థాయి అధికారులు, వీఆర్‌ఓలకు ఓటరు జాబితా రూపకల్పన ఏరోనేట్ 2.0, బీఎల్‌ఓ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాస్థాయిలో అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తి చేయాలన్నారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.రవినాయక్, అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎస్పీ మహేష్, డీఐఓ మూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజాపూర్: పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న ఓ యువకుడు బుధవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన శరత్‌కుమార్ (22) ఓ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. పనికి వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో క్షణికావేశంలో ఈ నెల 6న ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నీమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ వివరించారు. కేసునమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

కొర్విపాడులో మరొకరు..

ఉండవెల్లి: మానవపాడు మండలం కొర్విపాడుకు చెందిన జగదీష్ (22) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బాలరాజు ఈ నెల 12న అలంపూర్ చౌరస్తాలో పురుగు మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారమిచ్చాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రాక్‌చేసి అలంపూర్ చౌరస్తాలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు కుటుంబ సభ్యుల సహకారంతో 108 వాహనంలో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

భర్త దాడిలో భార్య..


బాలమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం మత్తులో క్షణికావేశంలో భార్యపై ఓ వృద్ధుడు దాడి చేయడంతో భార్య అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని గన్యాగులలో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌చార్జ్ సీఐ సైదులు కథనం ప్రకారం.. గన్యాగుల గ్రామానికి చెందిన భార్యాభర్తలు మల్లయ్య, బాలమ్మ(62) గ్రామంలో నివాసం ఉంటున్నారు. మల్లయ్య తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి బాలమ్మ తన కూతురుతో ఫోన్‌లో మాట్లాడుతుండగా మద్యం మత్తులో ఉన్న భర్త, క్షణికావేశంలో భార్య తలను నేలపై బాదడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన స్థానికులు బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కొడుకు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ, కారు ఢీ : వ్యక్తి దుర్మరణం

ఉండవెల్లి: మండల కేంద్రం శివారు జాతీయ రహదారిపై బుధవారం లారీ, కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీని వెనుక నుంచి వచ్చిన కారు పట్టణ శివారులో ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ఖాజా హుస్సేన్‌కు స్వల్ప గాయాలవగా.. పక్కన కూర్చున సంతోష్ (39)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సంతోష్ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ వివరించారు. కారు డ్రైవర్ ఖాజా హుస్సేన్ నంద్యాలకు చెందిన వాడని తెలిపారు.

మంగంపేట తండాలో విషాదఛాయలు


అర్జున్ రాథోడ్ (ఫైల్)

మహమ్మదాబాద్: మండలంలోని మంగంపేట తండాకు చెందిన కానిస్టేబుల్ హన్మంతునాయక్ ఉద్యోగరీత్యా శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు అర్జున్ రాథోడ్ (12)కు బ్రెయిన్‌డెడ్ కావడంతో తల్లిదండ్రులు అతడి అవయవాలు దానం చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు లేకపోయినా అతడి అవయవాలు మరొకరితో ఉండాలని, అతడి కళ్లు సమాజాన్ని, మమ్మల్ని చూడాలన్న తపనతో దానం చేసినట్లు వారు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

లింగాల: వన్యప్రాణులను వేటాడి చంపడం చట్ట వ్యతిరేకమని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయాన్ని డీఎఫ్‌ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల చెన్నంపల్లిలో పట్టుబడిన అడవి జంతువు మాంసం విషయంపై ఆరా తీశారు. ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పద్మన్నపల్లికి చెందిన బల్మూర్ సింగోటం అనే వ్యక్తి దుప్పి మాంసాన్ని చెన్నంపల్లికి చెందిన కొందరికి విక్రయించినట్లు సమాచారం ఉందని తెలిపారు. లభించిన వండిన మాంసం శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని తెలిపారు.

వైద్యసేవల్లో మరో అడుగు


జడ్చర్ల ఏరియా ఆస్పత్రి

- నియోజకవర్గానికి 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరు
- మెరుగుపడనున్న అత్యవసర వైద్యసేవలు

జడ్చర్ల టౌన్: వైద్య సేవల్లో మరో అడుగు ముందుకు పడనుంది. జడ్చర్ల నియోజకవర్గ కేంద్రానికి క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చంద్రగార్డెన్‌లో నిర్వహించిన ప్రగతి సభలో ప్రకటించారు. కేర్‌సెంటర్ ద్వారా అత్యవసర వైద్యసేవలు అవసరం అయ్యే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే 100 పడకల ఏరియా ఆస్పత్రి ప్రారంభం కావటంతో నియోజకవర్గంలో వైద్యసేవలు ఎంతో మెరుగుపడ్డాయి. ఈ నేపథ్యంలో 50పడకలతో కూడిన క్రిటికల్ కేర్ సెంటర్‌తో మరిన్ని వైద్య, అత్యవసర సేవలు ప్రజలకు చేరువ కానున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత నియోజకవర్గంలో వైద్య సేవలు మెరుగుపడుతూ వస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో 100పడకల ఏరియా ఆస్పత్రి ఇటీవలే ప్రారంభం కాగా బాలానగర్ మండలంలో 30పడకల ఆస్పత్రి ఏర్పాటయ్యింది. ఊర్కొండపేట, జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల గ్రామానికి పీహెచ్‌సీలు మంజూరయ్యాయి. ఇటీవలే నవాబుపేట మండలంలోనూ 30పడకల ఆస్పత్రి మంజూరు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జడ్చర్ల సభలో ప్రకటించారు.

త్వరలోనే ప్రారంభిస్తాం..



జడ్చర్ల నియోజకవర్గానికి క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరైంది. సెంటర్‌ను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. 50పడకలతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్యం అందించేందుకు వీలవుతుంది. ఇప్పటికే 100 పడకల ఆస్పత్రి, బాలానగర్ 30పడకల ఆస్పత్రిలతో వైద్యసేవలు పెరిగాయి. ఐదు బస్తీ దవాఖానాలు, రెండు పీహెచ్‌సీలు కొత్తగా ఇచ్చాం. అన్ని సబ్‌సెంటర్లు పల్లె దవాఖానాలుగా మార్చి గ్రామాల్లోనే డాక్టర్లను అందుబాటులో ఉంచి, వైద్య సేవలు అందిస్తున్నాం.

– డా.లక్ష్మారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే

అత్యవసర సేవలకు క్రిటికల్ కేర్ సెంటర్..

50పడకలతో మంజూరైన క్రిటికల్ కేర్ సెంటర్ ద్వారా అత్యవసర సేవలు అందుతాయి. 44వ నంబరు, 167వ నంబరు రెండు జాతీయ రహదారులు జడ్చర్ల నుంచి వెళ్తుండటంతో, ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అదేవిధంగా అటు కల్వకుర్తి, ఇటు దేవరకద్ర, షాద్‌నగర్, నాగర్‌కర్నూలు నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాలు జడ్చర్లకు సమీపంలో ఉన్నాయి. వీటన్నింటా అత్యవసర పరిస్థితులు గుండెపోటు, పక్షవాతం, పాముకాటు, ప్రమాదాల బారిన పడిన వారికి రాత్రిళ్లు అత్యవసర సేవలు అవసరం అవుతాయి. క్రిటికల్ కేర్ సెంటర్‌లో వైవాటన్నింటికి సేవలు అందుతాయి. 24గంటలు నిష్ణాతులైన డాక్టర్లు అందుబాటులో ఉండనున్నారు. క్రిటికల్ కేర్ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. తాత్కాలికంగా ప్రస్తుత వంద పడకల ఆస్పత్రిలో నిర్వహించాలా, 44వనెంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేయాలా అన్న విషయం తేల్చాల్సి ఉంది. గతంలో జడ్చర్ల నియోజకవర్గానికి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. ప్రస్తుతం క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరు కావటం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్


సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

అయిజ: పట్టణంలోని భరత్‌నగర్‌కాలనీలో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరగడం, చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి అర్ధరాత్రి తిరిగిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు కావడం, వాట్సాప్‌లో చక్కట్లు కొట్టడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. దుస్తులు లేకుండా చేతిలో మారణాయుధం పట్టుకొని అటు ఇటు తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ విషయాన్ని కాలనీవాసులు ఎస్‌ఐ నరేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. చోరీ జరిగిన తీరుపై అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామన్నారు. చోరీ జరిగిన రోజే చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి తిరిగి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పట్టణవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రాత్రిళ్లు గస్తీ ముమ్మరం చేస్తామని, నిర్భయంగా ప్రజలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

రాజాపూర్: బిల్లు చెల్లించకపోవడంతో రాజాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రెండు రోజులుగా కరెంట్ లేకపోవడంతో కార్యాలయంలో పనిచేయడానికి సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. బుధవారం కరెంట్ బిల్లు చెల్లించడంతో సాయంత్రం కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందడంతో తహసీల్దార్ రాంబాయి, ప్రత్యామ్నాయంగా సిబ్బందిచే కార్యాలయం పక్కనే ఉన్న షెటర్‌లో ల్యాప్‌టాప్ పెట్టించి సర్టిఫికెట్ జారీ పనులను పూర్తి చేయించారు.

ముగిసిన షా-అలీ-పహిల్వాన్ ఉర్సు


ఉర్సు ఆవరణలో మహిళలు, చిన్నారులు

- నాలుగోరోజు మహిళలకు ప్రత్యేకం


చిన్నారుల ఆటలు

అలంపూర్: హజ్రత్ షా-అలీ-పహిల్వాన్ ఉర్సు బుధవారం ముగిసింది. చివరి రోజు మహిళల కోసం ప్రత్యేక ఉర్సు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు 11వ తేదీన షా-అలీ సర్ ముబారక్ దర్గా, ధడ్ ముబారక్ దర్గాల్లో గంధోత్సవాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండోరోజు 12వ తేదీన సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ పోటీలు, మూడోరోజు 13వ తేదీన ధడ్ ముబారక్ దర్గాలో పెద్ద కిస్తీలు నిర్వహించారు. ఉర్సులో పెద్ద కిస్తీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు మతసామరస్యాన్ని చాటుతూ కిస్తీలకు ప్రసాదం అందించారు. వేలాది మంది తరలివచ్చి కిస్తీ పోటీలకు తిలకించారు. చివరిరోజు బుధవారం మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా వెలిసిన గాజులు, బొమ్మల దుకాణాలు రద్దీగా మారాయి. రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్ వద్ద పిల్లలు సందడి చేశారు.

బాలుడి ఊపిరితిత్తి నుంచి పెన్‌క్యాప్ తొలగింపు

పాలమూరు: ఓ బాలుడిఊపిరితిత్తి నుంచి ఎస్‌వీఎస్ వైద్యులు పెన్ను క్యాప్ తొలగించారు. హైదరాబాద్‌కు చెందిన 9 ఏళ్ల బాలుడు పొరపాటున పెన్‌క్యాప్ మింగడంతో బాబుకు దగ్గు, ఆయాసంతోపాటు జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు పలురకాల వైద్యులను సంప్రదించారు. సీటీ స్కాన్, ఎక్స్‌రేలలో కనిపించకపోవడంతో న్యూమోనియాగా పరిగణించి మందులు ఇచ్చారు. అయినా తగ్గలేదు. దీంతో ఎస్‌వీఎస్ ఆస్పత్రిలోని ఊపిరితిత్తుల వైద్యుడు తుమ్మూరి వెంకటేశ్వరరెడ్డిని సంప్రదించారు. ఆయన బాలుడిని పరిశీలించగా పిల్లికూతలు ఉండటంతో ఫారిన్ బాడీగా అనుమానం కలిగి బ్రాన్‌కో స్కోపీ నిర్వహించగా బాలుడి కుడి ఊపిరితిత్తి గాలిగొట్టంలో పెన్‌క్యాప్ ఇరుక్కుపోయి నట్లు గుర్తించారు. వెంటనే అత్యాధునిక రిజిడ్ బ్రాన్కోస్కోపీ పద్ధతి ద్వారా పెన్‌క్యాప్ తొలగించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో ఫారిన్ బాడీ ఊపిరితిత్తులలో న్యూమోనియాను సాధారణ ఎక్స్‌రే, సీటీస్కాన్ ద్వారా గుర్తించడం కష్టమని అన్నారు. ఊపిరితిత్తులలో ఉంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం కూడా ఉందన్నారు.

నీట్‌లో సత్తా చాటిన 'రిషి' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నీట్ యూజీ–23లో జిల్లాకేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వీరిలో అనుష్క 672 మార్కులు, మౌర్య 653, కె.శివకుమార్ 640, క్రితిక్‌తేజ 630, యుగేందర్‌యాదవ్ 604, సాత్విక 589, మిథిల 586, శ్రీమిత్ర 569, వేణుగోపాల్ 589, కార్తీక్ 564, చిన్మయి 562, విశాల 554, తేజశ్రీ 553 మార్కులు సాధించినట్టు రిషి కళాశాల కరెస్పాండెంట్ చంద్రకళావెంకట్ తెలిపారు. తమ కళాశాలకు చెందిన మొత్తం 135 విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఈ విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ' చాటిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

నీట్ యూజీ–23లో జిల్లా కేంద్రంలోని 'ప్రతిభ' మెడికల్ అకాడమీ విద్యార్థులు ఘన విజయం సాధించారు. వీరిలో రిజ్వాన్ 585 మార్కులు, వరుణ్‌కుమార్ 567, అరవింద్‌కుమార్‌గౌడ్ 557, వన్షికారెడి 553, మేఘన 530, పావని 529, షేక్‌సాజిద్ 526, నరేందర్ 524, మహతిరెడ్డి 523, అనుపమ 521, సుదీక్ష 519, తబస్సుం సుల్తానా 516, శ్రీవర్ష 515, శివలీల 503 మార్కులు సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. అనంతరం ఈ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రతిభ జూనియర్ కళాశాల గౌరవ సలహాదారులు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎస్.వెంకటరామయ్య, ఎస్.వెంకట్‌రెడ్డి, ఎం.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవి' విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల యాజమాన్యం

నీట్ యూజీ–23 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి ఐఐటీ నీట్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. కార్తికేయ 572 మార్కులు, కావేరి 538, మణికంఠ 514, విష్ణువర్ధన్ 494, స్నేహిత్ 465, అనూష 418, నితిన్‌నాయక్ 415 మార్కులతో మెడికల్ ర్యాంకులు సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, ఎంసెట్ ఇన్‌చార్జ్ షాకీర్, యాజమాన్య బృందం రాఘవేంద్రరావు, కోట్ల శివకుమార్, నాగేందర్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, మెడికల్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు.

వైద్యం వికటించి మహిళ మృతి

- గుట్టుచప్పుడు కాకుండా శవం తరలింపు

కోస్గి: ప్రైవేట్ ఆస్పత్రిలో చేసిన ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కోస్గిలోని సూర్య హాస్పిటల్‌లో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆస్పత్రి నిర్వాహకులు అప్పటికప్పుడు బాధితులతో శవ పంచాయతీ నిర్వహించి, తెల్లవారకముందే గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని స్వగ్రామానికి తరలించి చేతులు దులుపుకున్నారు. సంఘటన పూర్తి వివరాలు.. దామరగిద్ద మండలం దేశాయ్‌పల్లికి చెందిన పోతుల లక్ష్మీ(40) కడుపు నొప్పి రావడంతో కోస్గిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షలు నిర్వహించిన ఆస్పత్రి వైద్యులు గర్భసంచి ఆపరేషన్ చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మహిళకు ఆపరేషన్ చేశారు. బుధవారం తెల్లవారు జామున మహిళ మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుకుని, ఆస్పత్రి నిర్వాహకులు తెల్లారకముందే గుట్టు చప్పుడు కాకుండా శవాన్ని ఆమె స్వగ్రామానికి తరలించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై ఆపరేషన్ చేసిన వైద్యుడు ఉపేందర్‌కుమార్‌ను వివరణ కోరగా మృతురాలికి ఆపరేషన్ చేసిన తర్వాత ఆరోగ్యంగానే ఉందని, తెల్లవారు జామున గుండెపోటు రావడంతో మృతి చెందిందని తెలిపారు.

జోరుగా డ్రగ్స్ దందా!


పట్టెం శివారులోని కోళ్ల షెడ్డులో డీఐఆర్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆల్ఫాజోలం (ఫైల్)

- రూ.3.14 కోట్ల ఆల్ఫాజోలం పట్టుకున్న డీఆర్ఐ అధికారులు
- సారా పట్టివేతకే పరిమితమైన ఎక్సైజ్‌శాఖ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని బిజినేపల్లి మండలంలో ఇటీవల ఓ కోళ్ల ఫారంలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ తయారీ చేస్తుండటంతో డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు దాడులు నిర్వహించి రూ.3.14 కోట్ల విలువ చేసే 31.42కిలోల ఆల్ఫాజోలం మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం కలకలం రేగింది. డ్రగ్స్ దందాపై ప్రతిపక్ష పార్టీలు ఎప్పటి నుంచో ఆరోపణలు చేస్తున్నా స్థానిక ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పొచ్చు. ముఖ్యంగా డ్రగ్స్‌ను అరికట్టడంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఎక్సైజ్ శాఖ పారదర్శకంగా ఉండకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. జిల్లాలో మారుమూల అటవీ ప్రాంతంలో తయారవుతున్న సారాపై అధికారులకు సమాచారం ఉంటున్నప్పటికీ, ఇటీవల పట్టుబడ్డ ఆల్ఫాజోలం తయారీపై సమాచారం లేదని చెప్పడం ఇక్కడి ఎక్సైజ్‌శాఖ పనితీరు ఏవిధంగా ఉందనే విషయం చెప్పకనే తెలుస్తుంది. జిల్లాలో డ్రగ్స్ తయారీ అధికారుల అండదండలతోనే కొనసాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కోళ్ల షెడ్‌లో ఆల్ఫాజోలం తయారు చేస్తున్న వ్యక్తికి సంబంధించిన మత్తు పదార్థాల నిల్వలను గతంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్ట్ చేశారు.

అధికారుల పర్యవేక్షణ అంతంతే..

కల్తీ కల్లు, సారా నివారించేందుకు మాదకద్రవ్యాల నివారణ విషయంలో అప్పుడప్పుడు ప్రత్యేక దినాలలో సమావేశాలు నిర్వహించి సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చే ఎక్సైజ్, పోలీసు అధికారులు కేవలం సారా పట్టుకోవడానికి పరిమితమయ్యారు. నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించుకుంటూ సంతోషపడుతున్నారే తప్పా అంతకన్నా ప్రమాదకరమైనటువంటి మాదకద్రవ్యాల నివారణలో మాత్రం పెద్దగా శ్రద్ధ చూపించిన దాఖలు లేవు. గతంలో కూడా రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చి తిమ్మాజిపేట, బిజినేపల్లి, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అధికారుల వైఫల్యంతో ఈ తప్పుడు వ్యవహారం లోగోట్టును రాష్ట్ర ఉన్నతాధికారులు ఛేదించేదాక స్థానిక అధికారులకు తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలో ఎవరైన మత్తు పదార్థాలను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇటీవల బిజినేపల్లి మండలంలో పట్టుబడ్డ మత్తు పదార్థాల ముడి సరుకు తీసుకువచ్చిన వ్యక్తి ఎక్కువగా రంగారెడ్డి జిల్లాలోనే వ్యాపారం చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. జిల్లాలో ఎక్కడా డ్రగ్స్ తయారీ లేదు.

– ఫయాజుద్దీన్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్

క్లుప్తంగా...

జి-20తో బంధం బలోపేతం

యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సాక్షి, హైదరాబాద్: జి–20 అగ్రికల్చరల్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అమెరికా–భారత్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. ఈ సంవత్సరం జి–20 అధ్యక్ష స్థానంలో భారత్ నాయకత్వాన్ని ఆమె అభినందించారు. భారత సంస్కృతి, వంటకాలు అంతర్జాతీయంగా పేరెన్నికగన్నాయన్నారు. 'టేస్ట్ ఆఫ్ అమెరికా'ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కింద అమెరికాలోని ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులు, బేవరేజెస్‌ను భారతీయులకు రుచికరంగా అందించడానికి వీలువుతోందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరగాలని ఆకాంక్షించారు. అమెరికా ఆహార పదార్థాలపై భారత్‌లోని దక్షిణాది ప్రజల్లో ఆసక్తి కల్పించడానికి వీలుగా బుధవారం నాడు ఓ స్టార్ హోటల్‌లో 'హై టీ సెలబ్రేషన్స్'ను నిర్వహించారు. అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన అండర్ సెక్రటరీ గ్జోచిట్ టర్రెస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిస్టా ల్యాబ్ సందర్శించిన జర్మనీ బృందం

తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన అంతర్జాతీయ విత్తన ప్రయోగశాల (టిస్టా)ను జర్మనీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో బృందం సమావేశమయ్యింది.

యూఏఈ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రారంభం



బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాయబార కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. యూఏఈ మంత్రి అహ్మద్ అలీ అల్ సయేగ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్‌లో యూఏఈ కాన్సులేట్ జనరల్ ఆర్‌ఎఫ్ అల్ నునైని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి జీ-20 వ్యవసాయ మంత్రుల సమావేశం

- 3 రోజులు హైదరాబాద్‌లో నిర్వహణ
- 30 దేశాల వ్యవసాయ మంత్రుల రాక



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ (ఏడబ్ల్యూజీ) మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధం అయ్యింది. గురువారం నుంచి ఈ నెల 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల డైరెక్టర్ జనరల్స్ పాల్గొంటారు. కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కైలాష్ చౌదరి మొదటిరోజు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఇందులో ప్రదర్శిస్తారు. అనంతరం వ్యవసాయ డిప్యూటీస్ మీటింగ్ (ఏడీఎం) జరుగనుంది. ద్వితీయార్థంలో అగ్రిబిజినెస్ ఫర్ ప్రాఫిట్, పీపుల్ అండ్ ప్లానెట్ నిర్వహణ, 'డిజిటల్లీ డిస్కనెక్ట్: వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం' కార్యక్రమాలు జరుగుతాయి. జీ-20 సమావేశంలో పాల్గొనే మంత్రులు, ఇతర ప్రతినిధి బృందాల నాయకులకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్వాగతం పలకడంతో రెండవరోజు సమావేశం ప్రారంభమవుతుంది. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలోని వ్యవసాయం, సుస్థిర జీవవైవిధ్యం, వాతావరణ సమస్యల పరిష్కారాలపై మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల చర్చలు మూడు సమాంతర సెషన్లలో జరుగుతాయి. మూడవ రోజు భారత్ అధ్యక్షతన అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్, జీ–20 ఫలితాలను ఆమోదించడంతో మంత్రుల సమావేశం ముగుస్తుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ –ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)కు సాంకేతిక విజ్ఞాన యాత్రకు ప్రతినిధి బృందం వెళ్తుంది.

నకిలీ విత్తన ముఠా అరెస్ట్

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరొకరు
- రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: నల్లగొండ ఎస్పీ



పట్టుబడిన నకిలీ విత్తనాలు, నిందితులతో ఎస్పీ అపూర్వరావు, ఇతర పోలీస్ సిబ్బంది

నార్కట్‌పల్లి: నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్ హిల్స్ ప్రాంతానికి చెందిన గోరంట్ల నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన గద్దం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగె వేణు, అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ఓ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటకలో పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి సమీపంలో స్టోరేజీ చేశారు. అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్ మీదుగా తరలించాలని నిర్ణయించుకున్నారు. కారులో నాగార్జున, రవీంద్రబాబు, వేణు బయలుదేరారు. పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఎర్టిగా కారును తనిఖీ చేయగా రెండు బస్తాల విత్తనాలు బయటపడ్డాయి. వాటిని వ్యవసాయ అధికారులు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి మిగతా విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నర్సింహ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించనున్నట్టు చెప్పారు.

కొద్దిగంటల్లో పెళ్లి... వడదెబ్బతో వరుడు మృతి



తిరుపతి (ఫైల్)

కౌటాల: ఆనందంగా పెళ్లి జరగాల్సిన ఇంట తీవ్ర విషాదం నెలకొంది. మరి కొద్ది గంటల్లో పెళ్లనగా వరుడు వడదెబ్బతో మృతి చెందాడు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం గుడ్లబోరి గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుండ్ల శ్యాంరావ్, యశోద దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు గుండ్ల తిరుపతి (32)కి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమిని గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం మధ్యాహ్నం వివాహ ముహూర్తం నిర్ణయించారు. వరుడి ఇంట్లోనే పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో పెళ్లి పత్రికల పంపిణీ, పెళ్లి ఏర్పాట్ల పనుల్లో వారం రోజులుగా అతను ఎండల్లో తిరుగుతున్నాడు. దీంతో తిరుపతి మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెళ్లి కోసం వేసిన పందిట్లో తిరుపతి మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో 'తెలంగాణ టాప్'

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తెలంగాణ ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీఏఆర్‌పీజీ) ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరుపై నెలవారీ నివేదికను బుధవారం విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం సగటున ఒక్కో ఫిర్యాదు పరిష్కారానికి కేవలం 8 రోజుల సమయం మాత్రమే తీసుకుందని ప్రకటించింది. కాగా మొత్తం నాలుగు కేటగిరీల్లో రాష్ట్రాలను విభజించి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. 72.49 శాతం ఫిర్యాదుల పరిష్కారంతో 15 వేల కంటే తక్కువ ఫిర్యాదుల కేటగిరీలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు తెలంగాణలో 2,633 ఫిర్యాదులు అందాయి. దేశంలోనే అతి తక్కువ సమయంలో 2,524 ఫిర్యాదులను పరిష్కరించిన తెలంగాణ రాష్ట్రం, పరిష్కార కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచిందని నివేదికలో వెల్లడించింది. అంతేగాక 15 వేల కంటే ఎక్కువ ఫిర్యాదుల కేటగిరీలో ఉత్తరప్రదేశ్ 1,16,840 ఫిర్యాదుల్లో 62.07 శాతం పరిష్కరించి ఆ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచింది.



విత్తిన విత్తనాలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

ఆశలు మొలకెత్తేనా..

చింతపల్లి: వర్షాలు పడగానే విత్తనాలు మొలకెత్తుతాయని పత్తి విత్తనాలను పొడి దుక్కుల్లో వేసేందుకే రైతులు ఆసక్తి చూపుతుంటారు. ఈ ఏడు కూడా అలాగే విత్తిన రైతులు ఇప్పుడు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పట్లో వానలు పడేట్లు లేవని మరికొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని చిలకరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ శివ సైతం.. తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి విత్తనాలు వేశాడు. వానల జాడ లేక వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నాడు. విత్తనాలు భూమిలో మురిగిపోకుండా, మొలకెత్తాలనే ఆశతో ట్యాంకర్‌తో నీటిని పోస్తున్నట్లు శివ తెలిపాడు.

మండే ఎండలు.. వడగాల్పులు

- రుతుపవనాల రాక ఆలస్యంతో అధిక ఉష్ణోగ్రతలు
- గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు



సాక్షి, హైదరాబాద్: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ దిశ నుంచి బలమైన గాలులు వీస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రధానంగా అదిలాబాద్, ఖమ్మం, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇక గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా కరీంనగర్ జిల్లా తంగులలో 45.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 42.2 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 25.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల	కరీంనగర్	45.4
శ్రీరాంపూర్	పెద్దపల్లి	45.1
తక్కళ్లపల్లి	పెద్దపల్లి	44.4
లక్ష్మీదేవిపల్లి	కొత్తగూడెం	44.2
మల్లాపూర్	జగిత్యాల	44.2

రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	41.8	30.4	ఖమ్మం	42.2	30.0
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	38.7	27.0
హకీంపేట్	39.0	26.8	మెదక్	40.6	25.2
దుండిగల్	39.0	26.0	నల్లగొండ	41.0	25.4
హనుమకొండ	40.5	29.5	నిజామాబాద్	40.3	27.4
హైదరాబాద్	39.1	27.0	రామగుండం	41.6	31.5

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాలా విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలులోకి తేవాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, కార్యదర్శి ప్రశాంత్, సంఘం నాయకులు నందు, ఈశ్వర్, రాధిక, రమాదేవి, శ్రీనాథ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

ధరూరు/దోమలపెంట/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో బుధవారం పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.145 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 220 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు.

శ్రీశైలంలో 809.2 అడుగులు

శ్రీశైలం జలాశయంలో బుధవారం 809.2 అడుగుల వద్ద 33.8614 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి నీటి విడుదల జరగలేదు. శ్రీశైలం జలాశయంలో 205 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,018..

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,018 అడుగుల నీటిమట్టం ఉంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వాడుతున్నారు.

పేదలకు అందని నాణ్యమైన వైద్యం

- ధరణి పోర్టల్‌తో నట్టేట ముంచిన ప్రభుత్వం
- 2009 పునరావాస బాధితులకు నేటికీ ఇళ్లు కరువు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కొర్విపాడులో పర్యటిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మానవపాడు: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం మండలంలోని కొర్విపాడు, కలుకుంట్ల, మద్దూరు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వల్ప అస్వస్థతకు గురైతే వైద్య పరీక్షల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే సీఎం కేసీఆర్‌కు, పేదలు అనారోగ్యంతో బాధపడుతుంటే నాణ్యమైన వైద్యం అందించలేకపోతున్నాడని విమర్శించారు. పేదలకు ఉచిత వైద్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ధరణి పోర్టల్‌తో తెలంగాణ ప్రభుత్వం రైతులను నట్టేటముంచిందని, కేసీఆర్ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద ఉండాల్సిన రెవెన్యూ రికార్డులను ధరణి పేరుతో పూర్తిగా ప్రైవేట్ కంపెనీకి అప్పగించి, కేసీఆర్ రూ.50కోట్ల దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో నిర్వహించే ప్రైవేట్ సంస్థకు కేటీఆర్‌తో సంబంధాలు ఉన్నాయని, పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. 2009లో తంగభద్ర వరదలో మునిగిపోయిన గ్రామాలకు నేటి వరకు ముంపుప్రాంతాల వారికి ఇళ్లు ఇవ్వలేదని నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ వస్తే పాలమూరు జిల్లాను అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత వలసలు ఎందుకు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హీరో ప్యాషన్ ప్లస్




మార్కెట్‌లోకి విడుదల చేసిన నూతన బైక్

పాలమూరు: హీరో కంపెనీ నుంచి కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన హీరో ప్యాషన్ ప్లస్ 100 సీసీ బైక్‌ను బుధవారం జిల్లాకేంద్రంలోని అశ్విని హీరో షోరూంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ అజీముద్దీన్ మాట్లాడుతూ ఈ బైక్ ప్రోగ్రామ్డ్ ఫ్యూయల్ ఇంజెక్షన్ ఇంజిన్ కలిగి ఉందన్నారు. డిజి అనలాగ్ మీటర్‌తోపాటు మొబైల్ చార్జింగ్ తదితర ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఈ బైక్ మార్కెట్‌లో మూడు రంగులలో లభ్యమవుతుందని, ఎక్స్ షోరూం ధర రూ.75,641 అందుబాటులో ఉందన్నారు.

వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

గద్వాల రూరల్: బంగారు తెలంగాణ పేరుతో కేవలం తన కుటుంబాన్ని మాత్రమే బంగారుమయం చేసుకుంటూ మిగతా తెలంగాణను దోచేసిన మోసకారి సీఎం కేసీఆర్ అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆమె స్థానిక డీకే బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. గతంలో గద్వాలకు ఇచ్చిన హామీలను ఒక్కటి నెరవేర్చని కేసీఆర్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం పేరిట ఏముఖం పెట్టుకుని మళ్లీ గద్వాలకు వచ్చారని ప్రశ్నించారు. బహిరంగ సభకు తీసుకువచ్చిన జనాలకు గొడ్డుకారం పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. తమ హయాంలో సాధించుకున్న నెట్టెంపాడు ప్రాజెక్టును 90 శాతం పనులు పూర్తి చేస్తే తొమ్మిదేళ్ల కాలంలో మిగిలిన 10 శాతం కూడా పూర్తి చేయలేని దద్దమ్మలు బీఆర్‌ఎస్ పార్టీ వారన్నారు. మేమే అంతా చేశామని అబద్ధాలు చెప్పుకొంటే ప్రజలు నమ్మరన్నారు. తొమ్మిదేళ్ల క్రితం గట్టు ఎత్తిపోతలకు శంకుస్థాపన చేస్తే నేటికీ ప్రాజెక్టును పూర్తిచేయలేదని, దాన్ని కూడా మేమే సాధించామని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తన వ్యక్తిగత స్వార్థంతో నాయకత్వాన్ని అణచివేయాలనే దురుద్దేశంతో చిన్నచిన్న జిల్లాలు ఏర్పాటు చేసిన విచ్ఛిన్నకారిగా మారాడని మండిపడ్డారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడం, ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్, ముదిరాజులను బీసీ–ఎలో చేర్చుతామని ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు గద్దం కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ



మాట్లాడుతున్న మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని దుందుభీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్‌ను రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న తాడూరు మండలం మేడిపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారని.. ఆ సమయంలో తానూ క్షేత్రస్థాయిలో పరిశీలించానని, వ్యవసాయ పొలాల్లో అక్రమార్కులు ఎక్కడికక్కడ ఇసుక డంపులను నిల్వచేశారన్నారు. గ్రామస్తుల ఒత్తిడితో ఇసుక టిప్పర్‌ను పోలీసులు స్వాధీనపర్చుకున్నా.. రెవెన్యూ శాఖకు అప్పగించకుండా ఒక్కరోజులోనే విడిచిపెట్టారని ఆరోపించారు. సెలవు దినాల్లో టిప్పర్‌ను వదిలిపెట్టడంలో రాజకీయ జోక్యం ఉందన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ అధికారులను కుర్చీలో కూర్చోబెడుతుండగా ఉటో, బైటో అంటూ తాము చెప్పినట్టే అధికారులు వినాలనే సంకేతాలను ఇస్తున్నారని మండిపడ్డారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈసారి నాకే అవకాశం ఇవ్వాలి..

కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా సాదరంగా ఆహ్వానం పలుకుతానని నాగం స్పష్టం చేశారు. అయితే ఇంటిదొంగల పని పట్టేందుకు తనలాంటి వాళ్లు అసెంబ్లీలో ఉండాలని, ఇందుకోసం ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కృష్ణానదిపై సిద్దేశ్వరం, సంగమేశ్వరం, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రలోని నెల్లూరు, ప్రకారం వరకు నీటిని తరలిస్తున్నా ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నోరు మెదపడం లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండి ఉంటే అవేమీ జరిగేవి కావని వ్యాఖ్యానించారు. అసమర్థ నాయకులను గద్దెదింపి.. ప్రజల అభిప్రాయాలను చెప్పేవారిని ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో అర్థం రవి, లక్ష్మయ్య, పాండు, నిజాం, మల్లేశ్ పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ శిబిరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలోనే మొదటిసారిగా కర్నూలు ట్రిపుల్ ఐటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 23 వరకు జేపీఎన్‌సీఈలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఆ కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ చెప్పారు. బుధవారం డ్రోన్ శిక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్నిరంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తృతంగా పెరగనుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని తమ కళాశాలలో వంద మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా డ్రోన్లు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పడమే గాక గ్రామాల్లోని రైతు పొలాల్లో రసాయనాలను వెదజల్లడానికి డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించనున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో ఔషధాలు అందించడంలో, భూకొలతల సర్వేలో సంపూర్ణమైన ఫలితాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఎమర్జెన్సీ మెడిసిన్ సరఫరా చేసుకోవచ్చన్నారు. డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ద్వారా అనేక కంపెనీల్లో ఉద్యోగాలు పొందడానికి అవకాశం వస్తుందన్నారు. కర్నూలు ట్రిపుల్ ఐటీ సీనియర్ ప్రొఫెసర్ సత్యబాబుతోపాటు మరో నలుగురు ప్రొఫెసర్ల సహకారంతో విద్యార్థులకు డ్రోన్ తయారు చేసే విధానం, ఉపయోగించడం, చివరి రోజు డ్రోన్ల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు జగపతిరావు, జేపీఎన్‌సీఈ ప్రిన్సిపల్ సుజీవన్‌కుమార్, డైరెక్టర్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ టుడే లీగ్‌లో ప్రతిభ చాటాలి



టుడేస్ లీగ్‌లో పాల్గొనే క్రికెట్ జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ టూడేస్ లీగ్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన హెచ్‌సీఏ బీ–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్ 2023– 24 సీజన్‌లో పాల్గొనే ఎండీసీఏ క్రికెట్ జట్టు తరలివెళ్లింది. ఈ సందర్భంగా ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా క్రికెట్ జట్టును రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పలుసార్లు టూడేస్ లీగ్ మ్యాచుల్లో జిల్లా క్రికెట్ జట్టు మెరుగ్గా రాణించిందని, ఇదే స్ఫూర్తితో లీగ్‌లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. ఎండీసీఏ జట్టు టూడేస్ లీగ్‌లో రాణిస్తే త్రిడేస్ లీగ్‌లో అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. పూల్–ఈలో మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ జట్టు గురువారం, శుక్రవారాల్లో తన తొలి మ్యాచ్‌ను టీం స్పీడ్ జట్టుతో ఆడనుంది.

హెచ్‌సీఏ–బి డివిజన్ ఎండీసీఏ జట్టు

హర్షవర్ధన్ (కెప్టెన్), శ్రీకాంత్ (షాద్‌నగర్), సాయి, అబ్దుల్ రాఫే, షాదాబ్ అహ్మద్, అనిల్, జుబేర్, శ్రీకాంత్, కాశీం, అద్నాన్, కిషోర్, అరవింద్, ముఖిత్, ఆదిత్యరెడ్డి, సాహిల్, సిద్దార్థ.

హెచ్‌సీఏ త్రీడేస్ లీగ్‌కు జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) త్రీడేస్‌కు లీగ్‌కు ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం త్రీడేస్ లీగ్ ప్రారంభం కాగా.. జిల్లా క్రీడాకారులు గణేష్, అరుణ్‌కుమార్, డేవిడ్ త్రీడేస్ లీగ్‌లో తెలంగాణ కంబైన్డ్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఇప్పటికే గణేష్ పలుసార్లు హెచ్‌సీఏ త్రీడేస్‌లో పాల్గొనగా డేవిడ్, అరుణ్‌కుమార్ రెండోసారి త్రీడేస్ లీగ్‌లో ఆడుతున్నారు. అలాగే జింఖానా మైదానంలోని హైదరాబాద్ క్రికెట్ అకాడమీకి జిల్లాకేంద్రానికి క్రీడాకారుడు అబ్దుల్ రాఫే ఎంపికయ్యాడు. ఎంతో ప్రతిష్టాత్మకమైన అకాడమీకి జిల్లా క్రీడాకారుడు ఎంపికవడం విశేషం. వీరి ఎంపికపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా అభినందించారు.

'ఊపా కేసు ఎత్తివేయాలి'

పాలమూరు: ప్రభుత్వం ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా వంటి మేధావుల మీద అక్రమంగా మోపిన ఊపా కేసు వెంటనే ఎత్తివేయాలని పాలమూరు అధ్యాయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి బుధవారం ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్లుగా ప్రజా సంఘాలు, విద్యార్థి నాయకులు, మహిళా కార్యకర్తలపై ఊపా కేసులు నమోదు చేయడం ఒక విధానంగా అమలు చేస్తోందన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి కేసులు నమోదు చేసే విధానం లేదని, రాష్ట్ర సాధనకు కృషి చేసిన అందరి మీద ఇలాంటి తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.